సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



క్యాన్సర్ రోగులకు భరోసా

క్యాన్సర్ రోగులకు కేజీహెచ్‌లో మెరుగైన వైద్యం లభిస్తోంది. మొత్తం 75 పడకలు ఏర్పాటు చేశారు. 8లో



మత్స్యకారులకు సిరులు

మత్స్యకారులకు చేపలు పుష్కలంగా దొరుకుతున్నాయి. వలలకు భారీ సంఖ్యలో కొమ్ముకోనం, సొర చేపలు చిక్కాయి. 8లో



కరాటే పోటీలు ప్రారంభం

రాష్ట్ర రాజధానిగా అవతరించనున్న విశాఖలో మార్షల్ ఆర్ట్స్‌కు ప్రాధాన్యం ఉంటుందని సినీ నటుడు సుమన్ అన్నారు. 8లో

న్యూస్‌రీల్

నేడు కల్యాణమస్తు వేడుక

విశాఖ విద్య: ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన అర్హులైన నూతన వధూవరులకు వైఎస్సార్ కల్యాణ మస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకం కింద ఆర్థిక సాయం అందిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ డి.వి.రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక వేడుక నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో పథకం మంజూరుచేస్తారన్నారు. అర్హులైన నూతన వధూవరులు కలెక్టరేట్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

నవోదయ దరఖాస్తు గడువు పెంపు

కొమ్మాది : జవహర్ నవోదయ విద్యాలయంలో వచ్చే విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ సంజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి ఈ నెల 8వ తేదీతో గడువు ముగిసిందని పేర్కొన్నారు. అయితే విద్యార్థులకు మరో అవకాశం ఇచ్చేందుకు గడువు తేదీని పొడిగించినట్టు తెలిపారు. నవోదయ వెబ్‌సైట్ www.nvs.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అదే విధంగా అభ్యర్థులు కేటగిరి, ప్రాంతం, మీడియం, అంగవైకల్యం వంటి విషయాల్లో సవరణ చేసుకునేందుకు ఈనెల 16, 17 తేదీల్లో వెబ్‌సైట్‌లో అవకాశం ఉంటుందని ప్రిన్సిపాల్ సంజయ్ తెలిపారు.

వెట్టిచాకిరి నిర్మూలనపై అవగాహన కల్పించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖ విద్య: వెట్టి చాకిరి నిర్మూలనపై విస్తృత ప్రచారం చేపట్టి, ప్రజానీకంలో అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున అన్నారు. వెట్టి చాకిరి నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం కార్మిక శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన ప్రచార పోస్టర్‌లను కలెక్టరేట్ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెట్టి చాకిరి పూర్తిగా నిర్మూలన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని కార్మిక శాఖ అధికారులకు సూచించారు. ఉప కార్మిక కమిషనర్ ఎం.సునీత, సహాయక కార్మిక కమిషనర్ మోహన లక్ష్మి పాల్గొన్నారు.

ఆలిండియా చాంపియన్‌షిప్ పోటీలకు భీమిలి విద్యార్థి



ఆలిండియా చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన రమేష్

భీమునిపట్నం: బెంగళూరులో ఈనెల 12న జరుగనున్న ఆలిండియా ఇంటర్ వర్సిటీ క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ పోటీలకు భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపికయ్యాడు. బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వంతల రమేష్ జనవరిలో ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. దీంతో ఆలిండియా పోటీలకు ఎంపికై యూనివర్సిటీ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఈ సందర్భంగా గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల, పీడీ డాక్టర్ సి.గౌరీ శంకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యాసాగర్, అధ్యాపకులు రమేష్‌ను అభినందించారు.

కేకేలైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): భద్రతాకారణాల దృష్ట్యా కేకే లైన్‌లో నడిచే ప్రయాణికుల రైళ్ల గమ్యం కుదించినట్టు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు. 10న కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్–విశాఖపట్నం(18513)ఎక్స్‌ప్రెస్ దంతేవాడ నుంచి బయలుదేరుతుంది.

- విశాఖలో ఈనెల 10న బయల్దేరే విశాఖపట్నం– కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ రైలు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో 10,11 తేదీల్లో ఈ రైలు కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుంచి బయల్దేరుతుంది. ఆయా తేదీల్లో ఈ రైళ్లు దంతేవాడ–కిరండూల్ మధ్య రాకపోకలు సాగించవు.

నేడు కాకినాడ మెము రద్దు

ఈనెల 10వ తేదీన కాకినాడ – విశాఖపట్నం – కాకినాడ (17267 / 17268) మెము ఎక్స్‌ప్రెస్‌ను ఇరువైపులా రద్దు చేస్తున్నట్టు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.



ఎన్నికల నగారా

పట్టభద్రుల పోరుకు రంగం సిద్ధం



ఓటరు జాబితా, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి

- 16న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్
- మార్చి 13న పోలింగ్, 16న కౌంటింగ్
- ఈ నెల 9 నుంచి ఉత్తరాంధ్రలో అమల్లోకి ఎన్నికల కోడ్
- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల కమిషన్
- ఉత్తరాంధ్రలో 2,82,348 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు
- 338 పోలింగ్ స్టేషన్లు, 694 బ్యాలెట్ బాక్సులు
- 6 జిల్లాల్లో 1,860 మంది పోలింగ్ అధికారులు

సాక్షి, విశాఖపట్నం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగింది. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు సంబంధించిన ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం గురువారం వెల్లడించింది. దీంతో ఎన్నికల వేడి ఉత్తరాంధ్రలో రాజుకుంది. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్‌ను ప్రకటించగా.. బీజేపీ, పీడీఎఫ్‌లు తమ అభ్యర్థులను ఖరారు చేశాయి. మరోవైపు టీడీపీ చివరి నిమిషంలో అభ్యర్థిని మార్చడంతో నేతల్లోనే గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు షెడ్యూల్ విడుదల కావడంతో అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. గురువారం నుంచే ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున ప్రకటించారు.

ఏర్పాట్లలో నిమగ్నమైన అధికార యంత్రాంగం

షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా జిల్లా కలెక్టర్, అడిషనల్ రిటర్నింగ్ అధికారులుగా ఆయా జిల్లాల డీఆర్‌వోలు వ్యవహరించనున్నారు. బ్యాలెట్ బాక్సులు ఎన్ని ఉన్నాయి.? పోలింగ్ స్టేషన్ల ఏర్పాట్లు, సున్నితమైన పోలీస్ స్టేషన్లు, ఓటరు జాబితాలు, పోలింగ్ స్టేషన్‌ల్లో సిబ్బంది, అధికారుల కేటాయింపు తదితర అంశాలపై తలమునకలవుతున్నారు. కలెక్టర్ డా. మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవోలు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎప్పటికప్పుడు ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని అప్‌డేట్ చేయాలని ఆదేశించారు.

రాజుకున్న రాజకీయ వేడి

ఈసారి రాజకీయపక్షాలు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలపై ముందుగానే ఎన్నికలపై దృష్టిసారించాయి. అధికార వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్‌ని ప్రకటించగా.. ఆయన ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇక బీజేపీ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్సీ మాధవ్ కొనసాగుతున్నారు. పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్(పీడీఎఫ్) అభ్యర్థిగా డా.కోరెడ్ల రమాప్రభని ఎంపిక చేశారు. ప్రధాన ప్రతిపక్షం టీడీపీ మాత్రం చిన్నికుమారి లక్ష్మిని పక్కన పెటి డా. చిరంజీవిరావు తమ ఎమ్మెల్సీ అభ్యర్థి అంటూ తెర పైకి తీసుకొచ్చింది. ఈ విషయంలో చంద్రబాబు వ్యవహార శైలి ఉత్తరాంధ్ర టీడీపీ నాయకులు, కార్యకర్తలకు మింగుడుపడటం లేదు.

నోటిఫికేషన్ వివరాలివీ..

- షెడ్యూల్ విడుదల : ఈనెల 16
- నామినేషన్ల స్వీకరణ ప్రారంభం : ఈనెల 16
- నామినేషన్ల ముగింపు : ఈనెల 23
- నామినేషన్ల పరిశీలన : ఈనెల 24
- నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ : ఈనెల 27
- పోలింగ్ తేదీ : మార్చి 13వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు
- కౌంటింగ్ తేదీ : మార్చి 16
- ఎన్నికల ప్రక్రియ ముగిసే తేదీ : మార్చి 21

అప్పుడు 1.70 లక్షలు.. ఇప్పుడు 2.82 లక్షల ఓటర్లు

2017లో జరిగిన ఎన్నికల్లో 1.70 లక్షల మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదవ్వగా 69.7 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. ఈసారి 2.82 లక్షలకు పైగా ఓటర్లు నమోదైన తరుణంలో పోలింగ్ శాతం కూడా భారీగా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం నుంచి 2017లో ఎన్నికైన పీవీఎన్ మాధవ్ పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది.

జిల్లాల వారీగా ఓటర్లు

జిల్లా	ఓటర్లు	పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు
శ్రీకాకుళం	51,025	136
విజయనగరం	57,568	536
పార్వతీపురం మన్యం	18,307	188
అల్లూరి సీతారామరాజు	11,350	346
విశాఖపట్నం	1,03,243	2662
అనకాపల్లి	40,855	869
మొత్తం	2,82,348	4,737

పోలింగ్ స్టేషన్లు

జిల్లా	పోలింగ్ స్టేషన్లు	సహాయక స్టేషన్లు	మొత్తం పోలింగ్ స్టేషన్లు
శ్రీకాకుళం	57	02	59
విజయనగరం	64	06	70
పార్వతీపురం మన్యం	24	00	24
అల్లూరి సీతారామరాజు	14	01	15
విశాఖపట్నం	94	28	122
అనకాపల్లి	44	04	48
మొత్తం	297	41	338

అవసరమైన బ్యాలెట్ బాక్సులు

జిల్లా	500 ఓట్ల బాక్సులు	రిజర్వ్	ఇతర బాక్సులు	మొత్తం బాక్సులు
శ్రీకాకుళం	103	21	00	124
విజయనగరం	116	23	00	139
పార్వతీపురం మన్యం	37	07	00	44
అల్లూరి సీతారామరాజు	23	05	02	30
విశాఖపట్నం	207	41	08	256
అనకాపల్లి	82	16	03	101
మొత్తం	568	113	13	694

పోలింగ్ అధికారులు

జిల్లా	పీవో	ఏపీవో	ఓపీవో	రిజర్వ్	మొత్తం	మోనటరింగ్ అధికారి
శ్రీకాకుళం	59	59	177	30	325	59
విజయనగరం	70	70	210	35	385	70
పార్వతీపురం	24	24	72	12	132	24
అల్లూరి	15	15	45	08	83	15
విశాఖపట్నం	122	122	366	61	671	122
అనకాపల్లి	48	48	144	24	264	48
మొత్తం	338	338	1014	170	1860	338

టెస్టుల్లో మన భరత్

విశాఖ నుంచి తొలి ఆటగాడు



విశాఖ స్పోర్ట్స్: తెలుగు కుర్రాడు, ఆంధ్ర రంజీ ప్లేయర్, విశాఖ వాసి కోన శ్రీకర్ భరత్ చిరకాల కల నెరవేరింది. సుదీర్ఘ నిరీక్షణకు ఫలితం దక్కింది. ప్రతిష్టాత్మక బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ 2023 సందర్భంగా భరత్ అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. టీమిండియా టెస్ట్ స్పెషలిస్ట్ చేతేశ్వర్ పుజారా చేతుల మీదుగా టీమిండియా క్యాప్ అందుకున్నాడు. భరత్ జెర్సీ నంబర్ 14. యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్ గాయం కారణంగా భారత జట్టుకు వికెట్ కీపర్‌గా బాధ్యతలు నిర్వర్తించే అవకాశం మనోడికి దక్కింది. 'ఎన్నో ఏళ్ల ఎదురు చూపులకు ఇప్పుడు ఫలితం దక్కింది. టీమిండియా తరపున ఆడటం ఆనందంగా ఉందని భరత్ తెలిపాడు. తొలి టెస్ట్ ఆడుతున్న భరత్‌ను ఆంధ్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి, కార్యదర్శి గోపినాథరెడ్డి అభినందించారు. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్, జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. మరిన్ని మ్యాచ్‌లు ఆడాలని ఆకాంక్షించారు. ఆంధ్ర తరపున ఇప్పటికే ఎంఎస్‌కే ప్రసాద్ టెస్ట్‌లాడగా... విశాఖ నుంచి మాత్రం భరత్ తొలి ఆటగాడుగా నిలిచాడు.

సినీ ఫక్కీలో ఛేజింగ్

- గంజాయి స్మగ్లర్ల హల్‌చల్
- కారు, 30 కిలోల గంజాయి స్వాధీనం
- పరారైన నిందితులు
- ఎస్‌ఈబీ అధికారుల కారు ఢీకొని వ్యక్తికి గాయాలు



హనుమంతవాక వద్ద కారుతోపాటు గంజాయి స్వాధీనం చేసుకున్న అధికారి

ఆరిలోవ (విశాఖ తూర్పు) : ఇద్దరు యువకులు.. కారులో గంజాయి తరలిస్తున్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఎస్‌ఈబీ) అధికారులకు సమాచారం అందింది. గంజాయి తరలిస్తున్నవారిని అదుపులో తీసుకొనేందుకు విశ్వప్రయత్నం చేశారు. పోలీసులు వెంబడిస్తున్న విషయాన్ని గమనించిన స్మగ్లర్లు కారు వేగం పెంచారు. పోలీసులు రెండు కారుల్లో, స్మగ్లర్లు ఒక కారులో రయ్‌మంటూ దూసుకుపోతున్నాయి. స్మగ్లర్లు సినీ ఫక్కీలో వేగం పెంచగా.. పోలీసులు దూకుడు పెంచారు. పెందుర్తి నుంచి వేపగుంట కూడలి, సింహాచలం, అడవివరం మీదుగా బీఆర్‌టీఎస్ రోడ్డులో హనుమంతవాక వైపు స్మగ్లర్లు ప్రయాణించారు. పెదగదిలి కూడలి వద్ద గంజాయి తరలించే కారు రాంగ్ రూటులోకి వెళ్లింది. వారిని పట్టుకునేందుకు పోలీసులు రాంగ్ రూట్‌లో ప్రయాణించక తప్పలేదు. అయితే ఎదురుగా వాహనాలు వస్తుండంతో దొరికిపోవడం ఖాయమని భావించిన స్మగ్లర్లు విమ్స్ గేటు ఎదురుగా కారును నిలిపివేసి పరారయ్యారు. అధికారులు ఆ కారు డిక్కీ ఓపెన్ చేసి చూడగా అందులో మూడు పెద్ద గంజాయి మూటలు ఉన్నాయి. కారు, అందులో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. పరారైనవారిని పట్టుకోవడానికి సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. పట్టుబడిన గంజాయి సుమారు 30 కిలోలకు పైగా ఉంటుందని ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ శ్రీనాథ్ తెలిపారు.

యువకుడికి గాయాలు..

గంజాయి తరలించే కారును ఛేదించే క్రమంలో ఎస్‌ఈబీ అధికారులు ఉన్న రెండు కార్లు కూడా పెదగదిలి నుంచి సంజయ్‌గాంధీకాలనీ వరకు రాంగ్ రూటులోనే ప్రయాణించాయి. ఆ సమయంలో నగరం నుంచి ఆరిలోవ వైపు వస్తున్న ప్రయాణికుడు ఈశ్వరరావును ఎస్‌ఈబీ వాహనం ఢీకొంది. దీంతో ఈశ్వరరావుకు స్వల్ప గాయాలు కాగా ఆయన ద్విచక్రవాహనం నుజ్జయింది. దీంతో అధికారులు ఈశ్వరరావును ఆస్పత్రికి తరలించారు.

ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఫిష్ హబ్!

- రూ.కోటితో ఏర్పాటుకు సన్నాహాలు
- మార్చి ఆఖరుకల్లా అందుబాటులోకి వచ్చే అవకాశం
- ఈ హబ్ నుంచే రిటైల్ యూనిట్లకు తాజా చేపల సరఫరా
- ఫిష్ ఆంధ్ర' పథకంలో భాగంగా ఏర్పాటు



ఫిష్ ఔట్‌లెట్‌లో చేపలు (ఫైల్)

సాక్షి, విశాఖపట్నం: 'ఫిష్ ఆంధ్ర'లో భాగంగా విశాఖలో ఫిష్ హబ్ అందుబాటులోకి రానుంది. రూ.కోటి వ్యయంతో కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఇది ఏర్పాటు కాబోతోంది. ఫిష్ ఆంధ్రలో ఇప్పటికే వివిధ స్థాయిల్లో మినీ రిటైల్ ఫిష్ వెండింగ్ యూనిట్లు ఏర్పాటవుతున్నాయి. వీటిలో తాజా చేపలు, బతికున్న చేపలు, పీతలు, రొయ్యలతో పాటు సాయంత్రం వేళ చేపలతో తయారు చేసిన స్నాక్స్‌ను కూడా అమ్మకానికి ఉంచుతారు. ఇంకా వాల్యూ యాడెడ్ యూనిట్లలో చేపలతో తయారు చేసిన వంటకాలే కాకుండా మమూస్, వెజ్, నాన్ వెజ్ (చికెన్) వంటకాలు తినడానికి వీలుగా రెస్టారెంట్లను ఏర్పాటు చేస్తారు. వీటిని నడపడానికి ఆసక్తి ఉన్న వారికి ఈ యూనిట్లను కేటాయిస్తున్నారు. ఇందుకోసం రాయితీలిచ్చి ప్రోత్సహిస్తున్నారు. మత్స్యశాఖ అధికారులు విశాఖ జిల్లాలో రూ.10 లక్షలు, 20 లక్షలు, 50 లక్షల యూనిట్లను ఆసక్తి ఉన్న అర్హులకు మంజూరు చేస్తున్నారు. ఇవి జిల్లాలో ఒక్కొక్కటిగా ప్రారంభమవుతున్నాయి. నగరంలో జగదాంబ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రూ.10 లక్షల యూనిట్లు, మధురవాడలో రూ.20 లక్షల లైవ్ ఫిష్ యూనిట్‌లు ప్రారంభమయ్యాయి. పెందుర్తిలో రూ.10 లక్షల మినీ ఫిష్ వెండింగ్ యూనిట్ ఈనెల 12న, నగర పరిధిలో మరో 20 యూనిట్లు కొద్ది రోజుల్లోనే అందుబాటులోకి రానున్నాయి. కాగా ఫిష్ హబ్‌కు అయ్యే రూ.కోటిలో 40 శాతం రాయితీ ఉంటుంది. ఈ హబ్ ఏర్పాటు చేసే లబ్ధిదారు వాటా పోను మిగిలిన సొమ్మును బ్యాంకు రుణంగా సమకూరుస్తుంది.

చేపల సరఫరాకు ఫిష్ హబ్

ఆయా రిటైల్ ఫిష్ వెండింగ్ యూనిట్లకు అవసరమైన చెరువు, సముద్ర చేపలు, పీతలు, రొయ్యలు వంటి వాటిని సరఫరా చేయడానికి విశాఖ జిల్లాకు ఒక ఫిష్ హబ్ మంజూరైంది. ఈ హబ్‌లో వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన తాజా చేపలు, బతికున్న చేపలు, రొయ్యలను నిల్వ చేస్తారు. చేపల చెడిపోకుండా నిల్వ ఉండేందుకు ఐస్ ఫ్యాక్టరీ, కోల్డ్ స్టోరేజీలు, ఫ్రీజర్లు, లైవ్ ఫిష్ ట్యాంకులు వంటివి ఏర్పాటు చేస్తారు. ఈ సదుపాయాలతో చేపలు, రొయ్యలు, నాలుగైదు రోజులకు పైగా తాజాగా ఉంటాయి. ఈ హబ్‌లో కోల్డ్ చైన్ సిస్టం ద్వారా చేపలు, రొయ్యలు వృథా కాకుండా కట్ చేసి, కనీసం వారం రోజులు నిల్వ చేసే విధంగా వ్యాక్యూమ్ ప్యాకింగ్ కూడా చేసుకునే వీలుంది. వీటన్నింటికీ ఈ హబ్‌లో హోల్‌సేల్ పాయింట్‌గా ఉంచి అర్డర్ల మేరకు అవసరమైన వాటిని రిటైల్ యూనిట్లకు/ఔట్‌లెట్లు, రెస్టారెంట్లకు ఇన్సులేటెడ్ వాహనాల ద్వారా సరఫరా చేస్తారు. విశాఖ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఏర్పాటయ్యే ఫిష్ హబ్ (హబ్ అండ్ స్పోక్స్) మార్చి నెలాఖరు నాటికి అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నట్టు జిల్లా మత్స్యశాఖ అధికారి విజయ 'సాక్షి'తో చెప్పారు.

చేపల వినియోగం పెంచేందుకే..

చేపల వినియోగాన్ని పెంచే లక్ష్యంతో 'ఫిష్ ఆంధ్ర'ను ప్రవేశపెట్టారు. ప్రస్తుతం చేపల వార్షిక తలసరి వినియోగం 9 కిలోలుండగా దానికి క్రమంగా 25 కిలోలకు పెంచాలన్నది ప్రభుత్వ లక్ష్యం. చేపలతో పాటు చేపలతో తయారు చేసిన వంటకాలను అందుబాటులో ఉంచడం ద్వారా వీటి వినియోగాన్ని పెంచవచ్చని భావిస్తోంది.

ఫిష్ హబ్ లేఅవుట్ ఇలా..

ఖాళీ స్థలం	: 1,000 చదరపు గజాలు
ప్రాసెసింగ్ హాలు	: 2,700 అడుగులు
లైవ్ ఫిష్ ట్యాంక్	: 10,000 లీటర్ల సామర్థ్యం
చిల్ రూమ్	: 3-5 టన్నులు
చెస్ట్ ఫ్రీజర్	: 1,000 లీటర్లు

జేఎన్‌టీయూ(వీ) వీసీగా వెంకట సుబ్బయ్య



ఏయూక్యాంపస్ : జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఏయూ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ ఆచార్యులు కె.వెంకట సుబ్బయ్య నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వెంకట సుబ్బయ్య ఏయూలో బీటెక్, ఎంటెక్‌తో పాటు పీహెచ్‌డీ పూర్తి చేశారు. 1986లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరి 2006 నుంచి ప్రొఫెసర్‌గా 2018 నుంచి సీనియర్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. 2014లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డును అందుకున్నారు. అదే ఏడాది ఏయూ నుంచి బెస్ట్ రీసెర్చర్ అవార్డు స్వీకరించారు. 2014లో రాష్ట్ర ప్రభుత్వం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ అందించే భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య అవార్డు సైతం సాధించారు.

ఏయూ అకడమిక్ సెనేట్ సభ్యుడిగా, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా, రీసెర్చ్–డెవలప్‌మెంట్ విభాగం డీన్‌గా, ఏయూ డెవలప్‌మెంట్ సెంటర్ గౌరవ డైరెక్టర్‌గా, ట్రాన్స్‌పోర్ట్ విభాగం డీన్‌గా విభిన్న పదవులను నిర్వహించారు. క్లస్టర్ విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా, ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) ఉపాధ్యక్షుడిగా ప్రస్తుతం సేవలు అందిస్తున్నారు. ఆయన పర్యవేక్షణలో 28 మంది పీహెచ్‌డీ చేసి డాక్టరేట్‌లు అందుకున్నారు.

టూరిస్ట్ పోలీస్ స్టేషన్ ప్రారంభం నేడు

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): అందమైన విశాఖ సముద్ర తీరాన్ని సందర్శించేందుకు రోజూ వేల సంఖ్యలో టూరిస్ట్‌లు వస్తుంటారు. వారికి మరింత భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ఆర్కే బీచ్ వద్ద టూరిస్ట్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. దీనిని శుక్రవారం పోలీస్ ఉన్నతాధికారులు ప్రారంభించనున్నారు. ఈ స్టేషన్‌లో పర్యాటకులకు భద్రత కల్పించడంతోపాటు సహాయ సహకారాలను అందించనున్నారు.

త్వరితగతిన భూ రీసర్వే

అధికారులకు జేసీ విశ్వనాథన్ ఆదేశం



సాక్షి, విశాఖపట్నం : రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష (రీ సర్వే)ని త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. రీసర్వే, భూముల మ్యుటేషన్లు తదితర అంశాలపై సీసీఎల్‌ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ జిల్లా కలెక్టర్లు, జేసీలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిప్రసాద్ మాట్లాడుతూ భూముల హద్దులు కచ్చితత్వంతో ఉండాలన్నారు. సర్వే పూర్తయిన గ్రామాల వివరాలను ఎలక్ట్రానిక్ రిజిస్టర్ల ద్వారా కలెక్టర్లు నిర్వహించాలన్నారు. మారుమూల గ్రామాల్లో కూడా సర్వే చేసి హక్కు పత్రాలు ప్రజలకు అందించాలని, ఇందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న జగనన్న ఇంటి స్థలాల పంపిణీ ప్రక్రియ కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడిన జేసీ విశ్వనాథన్ రీసర్వేపై దృష్టిసారించాలన్నారు. వీలైనంత త్వరగా గ్రామాల్లో సర్వే పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సర్వే విభాగం సహాయ సంచాలకులు ఆర్.విజయ్‌కుమార్, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్య పద్మ పాల్గొన్నారు.

24 కిలోల కణితి తొలగింపు



మహిళకు శస్త్రచికిత్స చేసిన వైద్యుల బృందం

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రి గైనిక్ వైద్యవిభాగం ఆధ్వర్యంలో ఈ నెల 7న ఒడిశాలోని నవరంగ్‌పూర్‌కు చెందిన 59 ఏళ్ల సుకుమతి బిందాని అనే మహిళకు శస్త్రచికిత్స చేసి అండాశయం నుంచి 24 కిలోల కణితిని తొలగించారు. కడుపు ఉబ్బిపోయి అయిదేళ్లుగా బాధపడుతున్న ఈమె ఇటీవల ఆసుపత్రి వైద్యులను సంప్రదించింది. అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఎంఆర్ఐ, సిఏ125 పరీక్షలు చేసిన అనంతరం కుడి అండాశయం వద్ద 40x30x15 సెంటీ మీటర్ల కణితిని గుర్తించారు. గైనకాలజీ వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. అండాశయం నుంచి 20 లీటర్ల నీటి వ్యర్థాలను కూడా తొలగించారు. గురువారం ఆమెను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్టు వైద్యులు తెలిపారు.

క్యాన్సర్ రోగులకు కేజీహెచ్ భరోసా

- మెరుగైన వైద్యం
- ఆరోగ్యశ్రీలో 306 రకాల క్యాన్సర్ రోగాలు
- త్వరలో అత్యాధునిక పరికరాలు
- మొత్తం 75 పడకల ఏర్పాటు

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : క్యాన్సర్ రోగులకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. కేజీహెచ్‌లోని ఏపీ ప్రభుత్వ సమగ్ర క్యాన్సర్ చికిత్స సంరక్షణ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నారు. రోగులకు కార్పొరేట్ వైద్యం కేజీహెచ్‌లో ఉచితంగా అందిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ బోధన ఆస్పత్రుల్లో క్యాన్సర్ రోగుల కోసం అవసరమైన సేవలను అందిస్తోంది. వ్యాధి సోకిన వారికి వైద్య సేవలు అందించడంతోపాటు మందులు ఉచితంగా ఇస్తున్నారు. క్యాన్సర్‌లో 306 రోగాలను ఆరోగ్యశ్రీ పరిధిలో చేర్చి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ వ్యాధికి ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షల పెంచారు.

కేజీహెచ్‌లో..

పలు రాష్ట్రాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న కేజీహెచ్‌లో 2020 సెప్టెంబర్ 2న మెడికల్ అంకాలజీ డిపార్టుమెంటును ప్రారంభించారు. ఎండోక్రానాలజీలో విభాగంలో అప్పట్లో ఆరు పడకలతో అంకాలజీ యూనిట్ మొదలైంది. ఈ మెడికల్ అంకాలజీ డిపార్టుమెంటుకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఎస్.శిల్పాను నియమించారు. రోగుల సంఖ్య పెరగడంతో వారంలో మూడు రోజుల ఓపీ యూనిట్ మంజూరు చేశారు. ఆ తర్వాత రెండో వైద్యుడు డాక్టర్ రవీంద్రను నియమించారు. ఈ ఇద్దరు వైద్యులు రోగులకు సేవలు అందిస్తున్నారు. ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో అవుట్ పేషంట్ (ఓపీ) నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వైద్య ఆరోగ్యశాఖకు మరింత ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో విశాఖలోని కేజీహెచ్, గుంటూరు, కర్నూలు జిల్లాలో మెడికల్ అంకాలజీ విభాగాలను విస్తరించారు. ఇటీవల కేజీహెచ్‌లో అంకాలజీ వార్డులో పలు అభివృద్ధి పనులను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ప్రారంభించారు. పురుషుల కోసం 15 పడకలు, స్త్రీల కోసం 30 పడకలు, పిల్లల కోసం 15 పడకలు, రక్త క్యాన్సర్ కోసం 15 పడకలు కేటాయించారు. ప్రస్తుతం క్యాన్సర్ యూనిట్‌లో అందరికీ కలిపి 75 పడకలు కేటాయించారు.



సీఎస్‌ఆర్ బ్లాక్‌లో క్యాన్సర్ యూనిట్

ఆరోగ్యశ్రీ పరిధిలో...

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిలో 306 క్యాన్సర్ రోగాలను చేర్చారు. ప్రస్తుతం 137 రకాల మందులను ఉచితంగా ఇస్తున్నారు. ఆరోగ్యశ్రీలో రోగాల సంఖ్య పెరగడంతో 50 రకాల మందులు అవసరం ఉందని వార్డు యూనిట్ ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.శిల్పా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్‌కు లేఖ రాశారు.

ఉత్తరాంధ్రలో కేసులు ఎక్కువ

ఉత్తరాంధ్ర జిల్లాలో పలు క్యాన్సర్లు ఎక్కువగా సోకుతున్నాయి. మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్, అండాశయ ముఖద్వారం, అడ్డపొగ వల్ల నోటి క్యాన్సర్ వస్తోంది. ఇంకా ఊపిరితిత్తులు క్యాన్సర్, జీర్ణాశయ క్యానర్స్,ఎముకల క్యాన్సర్, బ్లడ్ క్యాన్సర్,పిల్లల క్యాన్సర్ సోకుతున్నాయి. జిల్లాలో క్యాన్సర్ కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. శ్రీకాకుళం,విజయనగరం జిల్లాల నుంచి బాధితులు చికిత్స కోసం కేజీహెచ్‌కు వస్తున్నారు. 20 ఏళ్ల క్రితం ఏడాదికి 1500 నుంచి 2 వేల వరకు కేసులు వచ్చేవి. ఇప్పుడు ఏడాదికి 15 వేల వరకు వస్తున్నాయి. ఓపీ విభాగానికి రోజుకు 25 నుంచి 30 మంది వరకు వస్తున్నారు. కేజీహెచ్‌లో ప్రస్తుతం రేడియో థెరపీ, కీమో థెరపీలు అందుబాటులో ఉన్నాయి. మరోక ఆరు నెలల్లో లీనాక్ పరికరం అందుబాటులో వస్తోంది. రూ.30 కోట్లతో వ్యయంతో విదేశీ పరిజ్ఞానంతో వచ్చే ఈ పరికరం వల్ల ఎక్కడ క్యాన్సర్ కణితి ఉందో అక్కడ వైద్య చికిత్సలు అందించే అవకాశం ఉంది. దీని వల్ల ఇతర శరీర భాగాలకు సైడ్ ఎఫెక్టు ఉండదని వైద్యులు చెబుతున్నారు.

క్యాన్సర్ రోగులూ.. భయం వీడండి



క్యాన్సర్ రోగులు ఎలాంటి భయాందోళనకు గురికావొద్దు. అన్ని రకాల వైద్య సదుపాయాలు కేజీహెచ్‌లో అందుబాటులో ఉన్నాయి. ఆరోగ్య శ్రీలో ఉచిత వైద్యం, మందులు కూడా ఇస్తున్నాం. గతంలో ఎన్నడు లేని విధంగా ప్రభుత్వం సహకారం అందిస్తోంది.

– డాక్టర్ ఎస్.శిల్ప, అసోసియేట్ ప్రొఫెసర్, మెడికల్ అంకాలజీ విభాగం, కేజీహెచ్

మత్స్యకారులకు సిరులు



ఫిషింగ్ హార్బర్‌లో కొమ్ముకోనం, సార చేపలను ఒడ్డుకు చేర్చుతున్న మత్స్యకారులు

- వలకు చిక్కిన కొమ్ముకోనం, సార
- ఫిషింగ్ హార్బర్‌కు భారీగా మత్స్యాలు

మహారాణిపేట : మత్స్యకారులకు చేపలు పుష్కలంగా దొరుకుతున్నాయి. వలలకు భారీ సంఖ్యలో కొమ్ముకోనం, సార చేపలు చిక్కాయి. గురువారం వాటిని ఫిషింగ్ హార్బర్‌కు తీసుకొచ్చారు. అందులో దాదాపు 60 కిలోల నుంచి 150 కిలోల వరకు కొమ్ముకోనం, సార చేపలు ఉండటంతో మత్స్యకారులు సంతోషించారు. వలకు భారీ కొమ్ముకోనం, సార, ఇతర చేపలు చిక్కడంతో వాటిని ఒడ్డుకు చేర్చేందుకు మత్స్యకారులు ఎన్నో వ్యయప్రయాసలకు గురయ్యారు. చేపలను బోటులోకి ఎక్కించి ఫిషింగ్ హార్బర్‌కు తీసుకొని వచ్చారు. అతి కష్టం మీద జెట్టీలో ఒడ్డుకు చేర్చారు. పెద్ద చేపలను ముక్కలుగా కట్‌చేశారు.



కొమ్ముకోనంకు భలే గిరాకీ

కొమ్ముకోనం చేపలకు మార్కెట్‌లో భలే గిరాకీ ఉంది. 8 నుంచి 15 అడుగుల వరకు ఉండే వీటిని కేరళ వాసులు ఇష్టంగా తింటారు. మంచి ధర పలికే ఈ చేపలు ఫిషింగ్ హార్బర్‌లో దర్శనమిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి అధిక సంఖ్యలో చేపలు దొరికాయని మత్స్యకారులు సంబరపడ్డారు. కష్టకాలంలో సమృద్ధిగా చేపలు లభించడం శుభపరిణామని మత్స్యకారులు అంటున్నారు. ఈ చేపలను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేశారు.

డిజిటల్ తీరం



బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): అందమైన సాగరతీరం ఇప్పుడు డిజిటల్ తీరంగా రూపుదిద్దుకుంటోంది. జీ20 సదస్సు నేపథ్యంలో సాగరతీరాన్ని ఆకర్షణీయంగా జీవీఎంసీ తీర్చిదిద్దుతోంది. అలాగే విశాఖలో ప్లాస్టిక్ నిషేధం అమలు చేయడంతో జీ20 ప్రకటనల కోసం తీరం మొత్తం ఎల్ఈడీ స్క్రీన్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ స్క్రీన్స్‌పై జీ–20 ప్రకటనలతో పాటు ప్లాస్టిక్ నిషేధం అమలుపై అవగాహన కల్పించే ప్రకటనలను ప్రదర్శించనున్నారు.

బ్యాంకు ఉద్యోగి దుర్మరణం



కోటేశ్వరరావు (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం (గాజువాక) : ద్విచక్రవాహనంపై విధులకు వెళుతున్న బ్యాంకు ఉద్యోగి బొలెరో వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వడ్లపూడి ఎస్సీ కాలనీకు చెందిన భీమపల్లి కోటేశ్వరరావు (27) దొండపర్తిలోని యాక్సెస్ బ్యాంకులో ఫైనాన్సియల్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం విధులకు వెళ్తున్న క్రమంలో కోటేశ్వరరావు ద్విచక్రవాహనాన్ని షీలానగర్ ఎయిర్ పోర్టు మధ్యలో మొదటి బ్రిడ్జి దాటిన తర్వాత వెనుక నుంచి వస్తున్న బొలెరో వాహనం ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన కోటేశ్వరరావును పోలీసులు షీలానగర్‌లో ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. గాజువాక ఎస్ఐ టి.రవికుమార్ ప్రమాద వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేపట్టారు.

పోర్టులో రైల్వే సైడింగ్ పరిశీలన

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): విశాఖ పోర్టులోని రైల్వే సైడింగ్‌ను గురువారం ఉన్నతాధికారుల బృందంతో కలిసి డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి పరిశీలించారు. బొగ్గు దిగుమతి, ఎగుమతి పాయింట్లను, కవర్‌షెడ్, ఇతర ముఖ్య ప్రాంతాలను పరిశీలించిన అనంతరం పోర్టు చైర్మన్ రామమోహనరావుతో డీఆర్ఎం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇరుపక్షాలకు(రైల్వే–పోర్టు) సంబంధించిన పలు విషయాలపై వీరు చర్చించారు. సామర్థ్యం పెంపుదల, రేక్‌ల సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నించనున్నట్లు డీఆర్ఎం తెలిపారు. వ్యాపారాభివృద్ధి కోసం డీఆర్ఎం, బృంద సభ్యులు పలు సూచనలిచ్చారు. అనంతరం పోర్టు ఫెసిలిటీస్ కార్యాలయంలో ఉన్నత స్థాయి రైల్వే ఉద్యోగుల బృందంతో, నాల్కో అధికారులతోను డీఆర్ఎం సమావేశం నిర్వహించారు. వ్యాపారాభివృద్ధి, లోడింగ్ సంబంధిత విషయాలపై చర్చించారు.



రైల్వే సైడింగ్ వద్ద నాల్కో అధికారులతో డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

మేలు చేసేవారిని మర్చిపోవద్దు



హీరో సుమన్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ధర్మకర్త బాలసుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు

సినీ నటుడు సుమన్

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): పదేళ్ల క్రితం రాజకీయాల్లోకి రావాలని అనుకున్నప్పుడు పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఎంజీ రామచంద్రన్, ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చే సమయంలో ఆ రాజకీయాలు వేరు. ఇపుడు ఆ పరిస్థితులు లేవని సినీ నటుడు సుమన్ పేర్కొన్నారు. సినిమా నటులు ఒకరినొకరు తిట్టు కోవడం, చాలా అసహ్యంగా మాట్లాడుకోవడం తరచూ చూస్తున్నామని, అటువంటి వాటికి తాను దూరమన్నారు. ఏపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, తెలంగాణలో కేసీఆర్‌కు తాను మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. ఎవరివల్ల మీరు బాగు పడుతున్నారో... ఎవరి వల్ల సంతోషంగా ఉన్నారో వారిని మర్చిపోవద్దని ఈ సందర్భంగా సూచించారు. జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం గొల్లపేటలో వెలసిన నర్సింగబిల్ల అమ్మవారిని హీరో సుమన్ దర్శించుకున్నారు. ఆయనను ఆలయ ధర్మకర్త కేవీ బాల సుబ్రహ్మణ్యం, కరాటే మాస్టర్ వీఎస్‌డీ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో విశేష పూజలు చేశారు. అనంతరం సుబ్రహ్మణ్యస్వామి, వేంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందించారు. ఈ సందర్భంగా సుమన్ మీడియాతో మాట్లాడారు. ఆలయ పవిత్రతను కాపాడుకోవాలని ఇది అందరి బాధ్యత అన్నారు. స్వర్ణభారతి స్టేడియంలో కరాటే టోర్నీకి ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు వచ్చానని తెలిపారు. ఇప్పటి వరకు తెలుగులో 100 సినిమాలు పూర్తి చేశానని, అన్ని భాషల్లో 700 సినిమాల్లో నటించానని సుమన్ వివరించారు.

కరాటే చాంపియన్‌షిప్ ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: సమీప భవిష్యత్తులో రాష్ట్ర రాజధానిగా అవతరించనున్న విశాఖలో మార్షల్ ఆర్ట్స్‌కు ప్రాధాన్యం ఉంటుందని సినీ నటుడు సుమన్ అన్నారు. స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో గురువారం ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో పలు విదేశీ కరాటేకలు పాల్గొనున్నారన్నారు. ఈ సందర్భంగా మేయర్ గొలగాని హరివెంకటకుమారి మాట్లాడుతూ క్రీడలు శారీరక మానసికానందాన్ని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో దాడి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు దాడి రత్నాకర్ పాల్గొన్నారు.

తెలుగుతల్లి ఫ్లై ఓవర్‌పై ప్రమాదం

దిమిలి వాసి మృతి



ప్రమాద స్థలంలో మృతుడు కామేశ్వరరావు

అల్లిపురం (విశాఖ దక్షిణ): తెలుగుతల్లి ఫ్లైవోవర్‌పై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. టూటౌన్ ఎస్ఐ కె.విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం దిమిలి గ్రామానికి చెందిన నాగమతూరి కామేశ్వరరావు(32) సంపత్ వినాయగర్ ఆలయం నుంచి రైల్వే స్టేషన్ వైపు ద్విచక్రవాహనంపై వెళుతూ పెద్ద మర్రిచెట్టు వద్ద డివైడర్ మధ్యలో గల పూలకుండీని బలంగా ఢీకొన్నాడు. కిందపడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విజయకుమార్ తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

మహారాణిపేట (విశాఖ దక్షిణ): వెట్టి చాకిరీ చట్టరీత్యా నేరం, వెట్టి చాకిరీని నిర్మూలిద్దాం అనే పోస్టర్లను డీసీపీ సునీల్ సుమిత్ గరుడ గురువారం విడుదల చేశారు. పోలీసు కమిషనర్ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమాన్ని గురువారం నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఏడీసీపీ డి.గంగాధరం, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ సునీత, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ మోహన్ లక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.105
స్కిన్	: రూ.180
స్కిన్‌లెస్	: రూ.190

కోడిగుడ్ల ధరలు

విశాఖపట్నం	: రూ.460
విజయనగరం +శ్రీకాకుళం	: రూ.464

బులియన్

బంగారం (10 గ్రాములు)	
24 కేరట్లు	: రూ.57,710
22 కేరట్లు	: రూ.52,900
వెండి (కిలో)	: రూ.73,500

అనధికార ఫుడ్ కోర్టులు 169

- వీటిపై చర్యలకు సిద్ధం
- వెండర్ సర్టిఫికెట్స్ ఉంటేనే వ్యాపారానికి అనుమతి
- దరఖాస్తు చేసుకుంటే లాటరీ పద్ధతి ద్వారా కేటాయింపు
- జీవీఎంసీ ఫుడ్ కోర్టు కమిటీ చైర్మన్ కటుమూరి సతీష్ వెల్లడి



సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్ సాధిక్

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ) : జీవీఎంసీ ఆదాయానికి గండి కొడుతున్న ఫుడ్ కోర్టులపై చర్యలకు రంగం సిద్ధమవుతోంది. జీవీఎంసీ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలకు ఉపక్రమించనున్నారు. నగర పరిధిలో కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి బీచ్ వరకు నడుస్తున్న ఫుడ్ కోర్టుల ద్వారా జీవీఎంసీకి అరకొర ఆదాయం మాత్రమే వస్తోంది. అంతేకాకుండా జీవీఎంసీ పేరుతో కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ విషయం ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో పలువురు కార్పొరేటర్లు పాలకవర్గం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఫుడ్ కోర్టులకు సంబంధించి ఓ కమిటీ ఏర్పాటు చేశారు. ఆ కమిటీ చైర్మన్‌గా డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు సభ్యులుగా ఉన్నారు. వీరు ఇటీవల ఫుడ్ కోర్టులకు సంబంధించి (టౌన్‌ప్లానింగ్, యూజీడీ, హెల్త్ విభాగం)అధికారులతో భేటీ అయ్యారు. పలు సూచనలు, సలహాలు తీసుకున్నారు. నగర పరిధిలో ఎంత మంది ఫుడ్ కోర్టులు నడుపుతున్నారు?.. బీచ్‌రోడ్డులో అక్రమంగా జరుగుతున్న దందాపై ఆరా తీశారు.

కమిటీ చైర్మన్, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, సభ్యుడు మహ్మద్ సాధిక్ గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో కమిటీ తీసుకున్న నిర్ణయాలు, అమలు చేయనున్న పద్ధతులను వివరించారు. అధికారుల లెక్కల మేరకు కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి బీచ్ వరకు 279 దుకాణాలు నడుస్తున్నాయని, వీరిలో 110 మందికి మాత్రమే వెండర్ సర్టిఫికెట్స్ ఉన్నాయన్నారు. ఈ 110 సర్టిఫికెట్లను ఉపయోగించి మిగిలిన 169 షాపులను నడుపుతున్నట్టు గుర్తించారు. ఇదిలా ఉండగా జీవీఎంసీ పేరుతో ఓ ముఠా వ్యాపారులనుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతోందని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్టు సతీష్, సాధిక్ స్పష్టం చేశారు. ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేసుకొనే వారు కచ్చితంగా వెండర్ సర్టిఫికెట్ పొందాలన్నారు. వెండర్ సర్టిఫికెట్‌తో పాటు టెంపరరీ ట్రేడ్ లైసెన్స్ జారీ చేసి నామమాత్రపు రుసుం వసూలు చేయనున్నట్టు చెప్పారు. అందుకు ఇప్పుడున్న వారితో పాటు ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే..లాటరీ పద్ధతి ద్వారా దుకాణాలు ఏర్పాటుకు స్థలాలు జోన్ల వారీగా కేటాయిస్తామని చెప్పారు. జీ–20 సదస్సు విశాఖలో జరగనున్న నేపథ్యంలో కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి బీచ్‌వరకు పలు జోన్లు ఏర్పాటు చేసి, జోన్ల వారీగా అన్ని రకాల ఫుడ్ ఐటెమ్స్ లభించేటట్టు చూస్తామన్నారు. ఫుడ్ కోర్టుల వద్ద విద్యుత్ లైట్లతో పాటు తగిన మౌలిక సదుపాయాలు కూడా ఏర్పాటు చేయడం, ఫుడ్ కోర్టును సుందరంగా తీర్చిదిద్దనున్నట్టు చెప్పారు.

సెంట్రల్ పార్క్ చుట్టూ..

నగర నడిబొడ్డున వైఎస్సార్ సెంట్రల్ పార్క్ చుట్టూ ఉన్న ఫుడ్‌కోర్టు విషయానికొస్తే కరోనాకు ముందు 29 దుకాణాలుండేవి.. ఆ తర్వాత మొత్తం 70 షాపులు ఏర్పాటుకు అప్పటి కమిషనర్ తాత్కాలిక అనుమతులు ఇచ్చారు. ఇది కాస్తా..129కి పెరిగిందని..చిరువ్యాపారులతో కలిసి 139 దుకాణాలు నడుస్తున్నాయన్నారు. వీరివల్ల కూడా జీవీఎంసీకి ఎటువంటి ఆదాయం లేని దృష్ట్యా ఇక్కడ కూడా దరఖాస్తు చేసుకున్న వారికి లాటరీ పద్ధతి ద్వారా దుకాణాలు కేటాయించి, వెండర్ సర్టిఫికెట్‌తో పాటు తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్ జారీ చేస్తామన్నారు. నామమాత్రపు రుసుం (రోజువారీ/పక్షం/నెలవారీ)వసూలు చేయనున్నట్టు సతీష్, సాధిక్ పేర్కొన్నారు. అలాగే ఫుడ్ క్వాలిటీ, ధరలు వంటి అంశాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఇక నుంచి స్టాండర్డ్ ఆపరేటింగ్ సిస్టమ్ ద్వారా చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు.